క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి



చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు

ముంచంగిపుట్టు: వ్యాపారస్తులు, ప్రజలు మండల కేంద్రం ముంచంగిపుట్టులో పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని ఈవోపీఆర్‌డీ చిన్నాన్న కోరారు. ముంచంగిపుట్టులో ఆదివారం ఎంపీడీవో సూర్యనారాయణ, సర్పంచ్ సుభాష్‌చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వెలుగు, ఎంపీడీవో, జీసీసీ కార్యాలయాలు, సంతబయలు, ఇందిరాకాలనీ, అంబేడ్కర్ పార్కు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్‌తో డంపింగ్ యార్డుకు తరలించారు. వీధుల్లో ఉన్న చెత్తను తొలగించారు. దుకాణదారులు, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను డస్ట్‌బిన్లలో వేయాలని చిన్నాన్న సూచించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగి శివార్లలో పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు ఆదివారం దాడి చేసి, ఆరుగుర్ని అరెస్ట్ చేశారు. వారి నుంచి 104 పేకాట కార్డులు, రూ.1,910 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి విలేకరులకు తెలిపారు. వీటిని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఎక్కడైనా పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాల్లో పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

మోదకొండమ్మ ఆలయంలో కుంకుమ పూజలు



ప్రత్యేక అలంకరణలో మాడుగుల మోదకొండమ్మ

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో శ్రావణ ఆదివారం సందర్భంగా ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. శ్రావణ తొలి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. సుమారు 300 మంది అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదాలతో పాటు తాగునీరు అందించారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు



స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, తూటిపాల, బూరుగుపాలెం, నగరం, కోడూరు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదాని స్మార్ట్ మీటర్లు వద్దని ప్రచారం నిర్వహించారు. సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రజలపై భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్ బిగిస్తే ఫోన్, టీవీకి ఎలా అయితే రీఛార్జ్ చేసుకోవాలో అలాగా కరెంటుకు రీఛార్జ్ చేసుకునే పద్ధతి వస్తుందన్నారు. అందువల్ల ప్రజలంతా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు.గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడితే బద్దలు కొట్టండి...అని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ప్రజలపై రుద్దడం అన్యాయమన్నారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

రావికమతం : కొత్తకోటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫర్ పూర్ పీపుల్ సంఘం ప్రతినిధులు బీఎన్ రోడ్డులో సంచరించే దివ్యాంగులు, అనాథలు, భిక్షాటన చేసే 300 మందికి ఆదివారం అన్నదానం చేశారు. సంఘ వలంటీర్లు కొత్తకోట నుంచి రోలుగుంట, కంచుగుమ్మల, నిండుగొండ, వెంకాయలపాలెం, చెట్టుపల్లి, నర్సీపట్నంవరకు, పెద్ద బొడ్డేపల్లి, కొవ్వూరు గ్రామాలలో గల వృద్ధాశ్రమంలోనూ అన్నదానం చేశారు. దివ్యాంగులకు, అనాథలకు, భిక్షాటన చేసేవారికి ఆకలి తీర్చడమే తమ సంస్థ ధ్యేయమని, గత రెండు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం చేస్తున్నామని సంఘ సభ్యులు తెలిపారు.

పైనాపిల్ సాగు.. లాభాలు బాగు

పైనాపిల్ కాపు



- 30 ఏళ్లుగా ఏజెన్సీలో కొండపై 60 ఎకరాల్లో సాగు
- లాభాలు ఆర్జిస్తున్న 30 గిరిజన కుటుంబాలు
- ఐటీడీఏ సహకారంతో సాగుపై ఆసక్తి



వారపుసంతలో పైనాపిల్ విక్రయిస్తున్న గిరిజన మహిళలు



కొల్లాపుట్టులో కొండపై పైనాపిల్ సాగు

డుంబ్రిగుడ: మన్యంలో పైనాపిల్ సాగు విస్తరిస్తోంది. ఈ పంట పట్ల ఆసక్తి చూపే రైతులకు ఐటీడీఏ తోడ్పాటు అందిస్తోంది. డుంబ్రిగుడ మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీలోని దిగువ కొల్లాపుట్టు, గొల్లోరివలస గ్రామాల్లో 30 ఏళ్లుగా పైనాపిల్ సాగుతో గిరిజనులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. పాడేరు ఐటీడీఏ చొరవతో సుమారు 60 ఎకరాల్లో 30 గిరిజన కుటుంబాలు ఈ పంటను సాగు చేస్తున్నాయి. ప్రతి కుటుంబానికి 2 నుంచి 3 ఎకరాలు సాగుకు అవకాశం కల్పించారు. ఎకరానికి సుమారు 700 పైనాపిల్ మొక్కల చొప్పున ఐటీడీఏ అధికారులు అందజేశారు. వాటిని సమీప కొండ (రాక్)లో సాగుకు అనుకూలంగా ఉండడంతో నాటారు. కొండ వాగులో పండిన పైనాపిల్ ఎంతో మధురంగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని గిరిజనులు చెబుతున్నారు.

నేరుగా వ్యాపారులే కొనుగోలు

ప్రతి ఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో అత్యధికంగా పైనాపిల్ దిగుబడి వస్తుంది. వీటిని కొనుగోలు చేసేందుకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బెంగాల్ నుంచి వ్యాపారులు వ్యాన్లతో సహా నేరుగా కొల్లాపుట్టు గ్రామానికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. పైనాపిల్ సైజుని బట్టి ధర నిర్ణయిస్తారు. పెద్ద సైజు అయితే రూ.20 నుంచి రూ.30, మధ్యసైజుకు రూ.15 నుంచి రూ.20, చిన్నసైజుకు రూ.5 నుంచి రూ.10కు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. వారపు సంతల్లో బుట్ట పైనాపిల్ రూ.150 నుంచి రూ.200, కావిడి రూ.250 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. ఏటా ప్రతి కుటుంబానికి రూ.30 వేలు నుంచి రూ.45 వేల వరకు ఆదాయం వస్తుందని గిరిజనులు చెబుతున్నారు. కొల్లాపుట్టు కొండ నుంచి జాలువారే జలపాతం, ఈ చుట్టూ ఉన్న పైనాపిల్ తోటలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

పైనాపిల్‌కు డిమాండ్ ఉంది



రెండెకరాల్లో పైనాపిల్ తోట వేశాను. నా భార్యే ప్రతి ఏటా తోటను చూసుకుంటుంది. ఇక్కడి పైనాపిల్‌కు మంచి డిమాండ్ ఉంది. ప్రతి ఏటా రూ.50 వేలు నుంచి రూ.60 వేలు వరకు విక్రయించి లాభాలు పొందుతున్నాం.

– పట్టేదొర దాసు, పైనాపిల్ రైతు, కొల్లాపుట్టు

నాలుగు ఎకరాల్లో సాగు



నాతో పాటు నా కుమారుడికి కలిపి సుమారు 4 ఎకరాల్లో పైనాపిల్ తోట ఉంది. 30 ఏళ్లుగా చేస్తున్నాం. ఏటా వచ్చే ఆదాయంతో ఆర్థికంగా బలపడుతున్నాం. పైనాపిల్ సాగుతో వచ్చే ఆదాయంతో పిల్లల చదువుతో పాటు ఇల్లు కట్టుకున్నాం.

– జెట్టి రామారావు, పైనాపిల్ రైతు, కొల్లాపుట్టు

దిగుబడి బాగుంది



ఈ ఏడాది వర్షాల కారణంగా దిగుబడి తగ్గిపోతుందని భయపడ్డాం. దేవుని దయతో మంచిగా దిగుబడి వస్తుంది. ఈ ఏడాది సుమారు రూ.50 వేలు వరకు పైనాపిల్ పండ్లు విక్రయించి లాభం పొందాను. మా గ్రామం నుంచి నేరుగా రైతుబజార్‌కు, వారపు సంతలకు తరలించేందుకు ఐటీడీఏ సబ్సిడీపై వాహనాలు అందజేయాలని కోరుతున్నా.

– కొర్రా మోహన్, పైనాపిల్ రైతు, కొల్లాపుట్టు

భద్రాద్రి రాముని సన్నిధిలో ఎమ్మెల్యే మత్స్యలింగం



రాముల వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ఎటపాక: భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామిని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి ఆలయాన్ని కూడా దర్శించుకుని పూజలు చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట జమగూడ పంచాయతీ సర్పంచ్ తెరవాడ వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగేని నాగరాజు, తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ బాలకృష్ణను సన్మానిస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ రామకృష్ణ

వై.రామవరం: వై.రామవరం నుంచి రంపచోడవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ బాలకృష్ణను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం సన్మానించారు. ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో బాలకృష్ణకు అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో బాలకృష్ణ అందించిన సేవలను కొనియాడారు.

ఘనంగా సీఆర్‌పీఎఫ్ వార్షికోత్సవం



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న 212 బెటాలియన్ సిబ్బంది



వై.రామవరం పోలీసు స్టేషన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ ఎం.రాధ

ఎటపాక: సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్ 87వ వార్షికోత్సవాన్ని ఎటపాకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అమరవీరులకు నివాళులర్పించారు. కమాండెంట్ క్వార్టర్ గార్డ్‌లో గౌరవ వందనం స్వీకరించి వివిధ రంగాల్లో సీఆర్‌పీఎఫ్ సాధించిన విజయాలపై చర్చించారు. 2026 మార్చికి ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం అంతం గురించి సైనికులకు వివరించి స్వీట్లు పంచారు. అనంతరం గౌరారం, పడగూడెం, కిష్టారం, పలాడి, పోటక్‌పల్లి, డబ్బామార్క గ్రామాల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కిష్టారం, డబ్బామార్కలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ దీపక్‌కుమార్‌శ్రీవాస్తవ, డాక్టర్ సుమిత్‌సెహగల్, కమాండ్ అధికారి దినేష్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ అజయ్‌ప్రతాప్, గౌరవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉన్న సీఆర్‌పీఎఫ్ జీ42 అదనపు బలగాల పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ పోలీసు బెటాలియన్ 87వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఆ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.రాధ, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, స్థానిక స్టేషన్ ఎస్ఐ బి.రామకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. బెటాలియన్ విజయాలను వివరించారు. సిబ్బంది గౌరవ వందనం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న నాయకులు

ఎటపాక: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గుండాల ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం ప్రముఖ వైద్యుడు శివరామకృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ పాఠశాల నుంచి పురుషోత్తపట్నం వరకు ఉన్న రోడ్డులో 50 బాదం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మనకు ప్రాణవాయువును ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ద ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి సుబ్బయ్య, వెంకటకృష్ణాజీ, డి.వి.శంకర్రావు, రవితేజ, సునీల్, శ్యామ్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు మోసాలను వివరించాలి



గన్నేరుపుట్టులో పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న అనిల్

హుకుంపేట: సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా గిరిజనులను పూర్తిగా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని మఠం గన్నేరుపుట్టు, జర్రకొండ, చీకుమద్దుల, మెరకచింత, అండిభ పంచాయతీల్లో పార్టీ మండల నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. గిరిజనుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో జరిగిన సమావేశంలో అనిల్ మాట్లాడారు. , బాబు మోసాలను గిరిజనులకు తెలియజేయాలని కోరారు. గ్రామ స్థాయిలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రేగం రమేష్, వెంకటరావు, చిట్టిబాబు, పార్టీ నాయకులు కాకరి వెంకట్, శివాజీ, కర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

స్థలాల లీజు ప్రతిపాదన విరమించుకోవాలి



డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

నర్సీపట్నం : ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఎన్ఎంయూ రీజియన్ అధ్యక్షులు రాజు, డిపో కార్యదర్శి జి.ఎస్. నారాయణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. మాల్ స్థలాలకు ఆర్టీసీ స్థలాలను ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే ప్రతిపాదన విరమించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పి.కె.రావు, ఎస్.రావు, మూర్తి, సంజీవి, కృష్ణ పాల్గొన్నారు.

డ్రాయింగ్ టీచర్‌కు జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న డ్రాయింగ్ టీచర్ కొండబాబు

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ కొండబాబు ఆదివారం జాతీయ స్థాయి ఆర్ట్ ఎక్స్‌పర్ట్ అవార్డు అందుకున్నారు. రాజమహేంద్రవరం భగీరథ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో కొండబాబు గీసిన చిత్రాలు ఉత్తమ చిత్రాలుగా ఎంపికయ్యాయి. రాజమహేంద్రవరం అదనపు ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా కొండబాబు బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఫౌండర్ ఎస్‌వీవీ లక్ష్మి, మోహన్ పాల్గొన్నారు. కొండబాబును స్థానిక పాఠశాల హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

అధ్వాన రహదారితో అవస్థలు



కర్రిముఖిపుట్టు మార్గంలో గతుకులతో ఉన్న రహదారి

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కర్రిముఖిపుట్టు వెళ్లే మార్గంలో ఫారెస్టు కార్యాలయం సమీపంలో పీఆర్ రోడ్డు అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. తక్షణమే పీఆర్ అధికారులు స్పందించి పాడైన రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు



దేవరాపల్లిలోని ఎరువుల దుకాణంలో నిల్వలను తనిఖీ చేస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ దుకాణదారులను హెచ్చరించారు. మండలంలోని లైసెన్స్ ఎరువుల దుకాణాలను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. దేవరాపల్లిలోని హేమ రైతు డిపో, మన గ్రోమోర్, కాశీపురంలోని శ్రీలక్ష్మీనారాయణ, వెంకట రోహిణి లైసెన్స్ ఎరువుల దుకాణాలలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. బిల్లు బుక్, స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దుకాణాల ఎదుట ఎరువుల ధర పట్టిక ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. రైతు విస్తీర్ణం ఆధారంగా ఎరువులు విక్రయించాలని, ఎరువులు కొనుగోలు చేసే రైతుల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు షాపు మూసే ముందు ఎన్ని బస్తాలు నిల్వ ఉన్నాయో స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో 24 టన్నులు, కలిగొట్ల పీఏసీఎస్‌లో 24 టన్నులు, ప్రైవేటు దుకాణాల్లో 40 టన్నులు మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పసలమారమ్మ పండగ



పండగలో అమ్మవారికి సారె ఊరేగిస్తున్న గ్రామస్తులు

చీడికాడ: వరహాపురం గ్రామంలో ఆదివారం ఉదయం పసలమారమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఖరీఫ్ వరినాట్లకు ముందు పశువులను పూజించడం ఆనవాయితీగా వస్తుందని సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్ములు తెలిపారు. ఆరుగాలం రైతులకు అండగా నిలుస్తూ కుటుంబంలో భాగంగా ఉండే పాడి పశువులను పూజించడం రైతులకు పశువుల పట్ల గల కృతజ్ఞతను తెలియజేస్తుందని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఈ మేరకు పసలమారమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

జాతీయ స్థాయి కథల పోటీలో పురస్కారం



తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి బహుమతి అందుకుంటున్న బలరామస్వామి

కశింకోట: జాతీయ స్థాయి కథల పోటీలో కశింకోటకు చెందిన కథా రచయిత బొడ్డేడ బలరామస్వామి తృతీయ బహుమతి పొందారు. నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీ పీఠం సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలో పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం ముల్కనూరు సభలో ఆయనకు దుశ్శాలువా కప్పి ఆ రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.10 వేలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ విషయమై బహుమతి గ్రహీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలోనూ బలరామస్వామి రాసిన కీడు గుడెసె, డేగ కథలకు బహుమతులు అందుకోవడంతోపాటు మూడోసారి అదే పీఠం నుంచి బహుమతి లభించడం పట్ల సాహితీ ప్రియులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

తూనికల్లో మోసాలు.!



ఆటోలో తీసుకువచ్చిన ఉల్లిపాయలు

డుంబ్రిగుడ: మండలంలోని గ్రామాల్లో ఆటోల్లో ఉల్లిపాయలు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నట్టు గిరిజనులు ఆరోపిస్తున్నారు. 5 కేజీల ఉల్లిపాయలు రూ.100 అని చెప్పి విక్రయిస్తున్నారని, తీరా వాటిని తీసుకుని ఇంటికి కిరాణా షాపుల్లో బరువు చూస్తే 4 కేజీలు ఉంటున్నాయని చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించి తూనికల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తూటిపాలలో అమ్మవారి పండగ



తలుపులమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, కె.తూటిపాలలో తలుపులమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమను భక్తులు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పండగ సందర్భంగా ఎలాంటి వివాదాలు తలెత్తకుండా గ్రామ పెద్దలు బాధ్యత తీసుకున్నారు.